
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 11 సెప్టెంబరు 2024

మానని గాయం..
ఘాట్‌రోడ్డు ప్రమాదానికి ఆరేళ్లు
7లో..

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి
8లో..

నిబంధనలు గాలికి..

- ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా వైద్యం
- వైద్యశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు
- అయినా మారని తీరు
- వైరల్ జ్వరాల నేపథ్యంలో మరింత దోపిడీ



జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రయివేటు ఆసుపత్రుల నిర్వాహకులు, ఆర్ఎంపీ, పీఎంపీలు ఆడింది ఆటా..పాడింది పాటగా తయారయింది. గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో వైద్యులుగా చలామణి అవుతున్న ఆర్ఎంపీ, పీఎంపీల్లో కొందరు తమ స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు. జ్వరం వస్తే విచ్చలవిడిగా యాంటి బయా టిక్స్ ఇవ్వడం, ప్రాథమిక చికిత్సను మించి వైద్యం చేస్తున్నారన్న విమర్శ లున్నాయి. వీరికి తోడు పలువురు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురిలతో పాటు ఇతర ప్రాంతాల్లో నూ పలువురు ప్రైవేటు వైద్యులు అధిక ఫీజులు వసూలు చేస్తుండడం, నిబంధనలను పట్టించుకోకపోవడం వంటివి చేస్తున్నారన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. పలు ప్రైవేటు ఆసుపత్రుల తీరును వైద్య శాఖ కఠినంగా పరిగణించి ఇటీవల పలు ప్రాంతాల్లో విస్తృతంగా తని ఖీలు చేసినప్పటికీ ఎలాంటి మార్పు కానరావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో 260 ప్రైవేటు ఆసుపత్రులు..

జిల్లా వ్యాప్తంగా సుమారు 260 ప్రైవేటు ఆసుపత్రులున్నట్లు వైద్య వర్గాలు అంటున్నాయి. ఇందులో ప్రధానంగా వంద ఆసుపత్రుల వరకు రో గుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్న అంచనా ఉంది. ప్రైవేటు ఆసుపత్రు లు ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిందేనని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేస్తోంది. ఆదేశాలను ఖాతరు చేయకపోతే కొరడా ఝులిపిస్తామని ఆశాఖ అంటోంది. కలెక్టర్ ఆదేశాలతో జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి తదితర పట్టణాల్లో సుమారు పది ప్రైవేటు ఆసుపత్రులను డీఎంహెచ్‌వో డాక్టర్ సమీయోద్దిన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ఇతరులు ఇటీవల తనిఖీలు చేశారు. లోపాలున్న ఆరు ఆసుప త్రులకు షోకాజు నోటీసులు అందించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ప్రతి ఒక్క ఆసుపత్రి నిర్వాహకులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కచ్చితంగా పాటించాల్సిందేనని వైద్య శాఖ అధికారులు అంటున్నారు. అంతే కాకుండా నోటిపై కమ్యూనికల్ డిసీజెస్ నమోదు, ఆరోగ్య శ్రీ సేవలను తనిఖీల్లో పరిశీలిస్తున్నారు. రెన్యువల్, రిజిస్ట్రేషన్ లేకుండా ఆసుపత్రులు, క్లినిక్స్, లేబోరెటరీలను నిర్వహించరాదని హెచ్చరిస్తున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలదే హవా..

గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలదే హవా కొనసాగుతోంది. పలువురు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు పరిమితికి మించి వైద్య చేయడం, యాంటి బయాటిక్స్ విచ్చలవిడిగా ఇవ్వడం, సెలైన్స్ ఎక్కించడం వంటివి చేస్తు న్నారు. ప్రాథమిక చికిత్సను దాటి వైద్య చేయడం, నిబంధనల మేరకు చిన్నపాటి గాయాలు, అత్యవసర సమయంలో బీపీ పరిశీలించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఎంబీబీఎస్ వైద్యులతో సమానంగా ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్యం అందించడం విమర్శలకు గురిచేస్తోంది. తాజాగా వెల్గటూరు మండలంలోని ఓ గ్రామంలో ఓ ఆర్ఎంపీ వైద్యుని చికిత్స వికటించి రోగి మృతి చెందాడన్న ఆరోపణలు చోటు చేసుకున్నాయి. ఈ వ్యవహారంపై వైద్య ఆరోగ్య శాఖ అధికా రులు విచారణ జరిపిస్తున్నారు. అయితే ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు విచ్చలవిడి వైద్యం చేస్తు న్నారన్న విమర్శలున్నాయి.

వివరాలు ప్రదర్శించాలి..

నిబంధనల ప్రకారం ప్రతీ ఆసుపత్రిలో అం దుబాటులో ఉన్న సేవలు, వైద్యులు, సిబ్బంది వివరాలు ప్రదర్శించాలి. ఓపీ నుంచి వసూలు చేసే ఫీజులు, ఇన్ పేషెంట్‌గా చేరితే రూము అద్దె, శస్త్ర చికిత్సకు వసూలు చేసే ఫీజులు, ఐసీయూ చార్జీలు, ఇలా ప్రతి అంశాన్ని పట్టిక ద్వారా రోగులకు కనిపించేలా ప్రదర్శించాల్సి ఉంది. రోగుల నుంచి తీసుకున్న ప్రతీ రూపాయికి బిల్లులు ఇవ్వాలి. అల్ట్రా సౌండ్ స్కానింగ్ వివరాలు, గర్భిణుల స్కానింగ్ నివేదికలు, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరమనే పోస్టరు ప్రదర్శనలు తప్పని సరిగా ఉండాలి. ఆసుపత్రులకు వస్తున్న ఓపీ పేషంట్లు, ఇన్ పేషంట్ల ఆరోగ్య పరిస్థితి వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు ఎప్పటికప్పుడు నివేదించాల్సి ఉంటుంది. మలేరియా, డెంగ్యూ, విరోచన వ్యాధులు, మీ జిల్స్, క్షయ వంటి వ్యాధులు నిర్ధారణ అయితే వాటి వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు అందించాలి.

కమీషన్ల దందా...

జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు ఆర్ఎంపీ, పీఎంపీలకు కమీషన్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆసుపత్రికి ఒకరిని రిఫర్ చేస్తే రూ. 3 వేల నుంచి రూ. 10 వేల వరకు రోగి పరిస్థితిని బట్టి కాసులిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైరల్ జ్వరాల నేపథ్యంలో...

ప్రస్తుతం ఎక్కడ చూసిన వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరం తగ్గినా ఒంటి నొప్పులు తీవ్రంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రోగులకు ఆరోగ్యంపై భరోసా కల్పించాల్సిన వైద్యులు బ్లడ్ ప్లేట్‌లెట్స్ తగ్గాయని చె బుతూ రూ. వేలల్లో రుసుములు వసూలు చేస్తున్నారు. వైద్య శాఖ ఉ న్నతాధికారులు ప్రయివేటు వైద్యంపై ప్రత్యేక దృష్టి పెడితే తప్పిదా లను అధిగమించే ఆస్కారం ఉంటుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పలు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడం, అనవసరంగా ఇన్ పేషంట్లను చేర్చుకోవడం, ల్యాబ్ టెస్టులు, మందుల పేరిట వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీలకు కమీషన్లు ముట్ట చెప్పాల్సి వస్తుండడంతో ఫీజుల్లో ఎలాంటి తగ్గింపులు లేకుండా ముక్కు పిండి వసూలు చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

డాక్టర్ సమీయోద్దిన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రుల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంచాము. ఇటీవల పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాము. నిబంధనలు పాటించని పలు ఆసుపత్రులకు నోటీసులు ఇవ్వడానికి సమాయత్తం అవుతున్నాము. ప్రధానంగా పలు ఆసుపత్రులల్లో అధిక ఫీజులు, వసతులు సరిగా లేకపోవడం, డెంగ్యూ నిర్ధారణలో నిబంధనలు పట్టించుకోకపోవడం, వైరల్ జ్వరాలు, ఇతర వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు అందించకపోవడం వంటివి జరుగుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించాము. మునుముందు మరింత పకడ్బందీగా వ్యవహరించి నిబంధనలను అతిక్రమించే ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాము.

రాహుల్ ఆలోచనలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల అర్బన్/జగిత్యాల రూరల్ సెప్టెంబరు 10: పాంచ్‌న్యాయ్ పేరుతో రాహుల్ గాంధీ ఫిరాయింపులను వ్యతిరేకిస్తే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆయన ఆలోచనలకు భిన్నంగా వ్యవహరించడం విచారకరమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండి అన్న రేవంత్ రెడ్డి, నేడు రాత్రిరాత్రి కండువాలు కప్పి ఫిరాయింపులకు పాల్పడుతు న్నారని, ఇప్పుడు రాళ్లతో కొట్టాల్సింది చేరిన ఎమ్మెల్యేలనా, రేవంత్‌రెడ్డినా అనేది ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. హైకోర్టు నిర్ణయం మేరకు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ప్రజల పక్షాన వసంత విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు కమలాకర్‌రావు, పడిగెల గంగారెడ్డి, తిరుపతి, ఆసిఫ్, పిన్నంశెట్టి సదానందం, బాలె చందు, శ్రీనివాస్ తదితరులున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తా

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తానని, శాసన మండలిలో అడుగిడి వాణి వినిపిస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడిమ్యాల గ్రామానికి చెందిన వ్యక్తిగా రాజకీయ అరంగేట్రం అంశాన్ని ఈ గడ్డపైనే వెల్లడించాలన్న భావనతో ఇక్కడకు వచ్చానన్నారు. రాజకీయాలకు అతీతంగా 34 ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా విద్యా సంస్థలను నడుపుతున్నానన్నారు. కేజీ నుంచి పీజీ వరకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి యున్న వ్యక్తిగా రాజకీయ రంగంలోనూ సేవలందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నానన్నారు. రానున్న రోజుల్లో ఏ పార్టీ నుంచి అయినా గానీ, అవసరమైతే స్వతంత్రంగా గానీ పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడి అభిప్రాయాన్ని వెల్లడించానన్నారు.

ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, పీసీల బదిలీలు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 : జిల్లాలో పలువురు ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, పీసీలను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్సై జమీల్‌ను మెట్‌పల్లికి, ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గంగారాంను మెట్‌పల్లి స్టేషన్‌కు బది లీచేశారు. గతంలో మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి ఎస్పీ కార్యాలయానికి అటాచ్‌గా ఉన్న ఏఎస్సై అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌లను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో ఉమెన్ పీసీగా పని చేస్తున్న సుమలతను కొడిమ్యాల స్టేషన్‌కు బదిలీ చేశారు.

సరైన పోషణతోనే ఆరోగ్య తెలంగాణ

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 : సరైన పోషణ తోనే ఆరోగ్య తెలం గాణ సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జానకి అన్నారు. జగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని రూరల్ మండలం పొలాస సెక్టార్‌లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలోని పొలాస, తిమ్మాపూర్, లక్ష్మీపూర్, జాబి తాపూర్, ధర్మారం తిమ్మాపూర్, రఘురాములకోటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ కరికులంపై ప్రదర్శన ఏర్పాటుచేసి తల్లులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న సేవలో యాదాద్రి ఈవో

మల్యాల, సెప్టెంబరు 10: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో భాస్కర్‌రావు మంగళవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా వచ్చిన ఈవో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో రామకృష్ణరావు శాలువతో సత్కరించగ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న ఆలయ నిత్యాన్నదానం పథకంకు ఈవో భాస్కర్‌రావు రూ.25వేలను అందజేశారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- గణేష్ మండపాల జియోట్యాగింగ్,
- ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు ని బంధనలు పాటించాలని వినాయక మండపాలు వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు వినాయకుల మండపాలను సందర్శించారు. ఈసందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2791 వరకు ఈసంవత్సరం వినాయక విగ్రహాలను ప్రతిష్టించారని తెలిపారు. వీటన్నింటికి ఇప్పటికే జియోట్యాగింగ్ పూర్తి చేశామన్నారు. జియో ట్యాగింగ్ పూర్తి చేసిన మండపాలను క్లిక్ చేస్తే మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలు అందులో కనిపించేలా చర్యలు చేపట్టామన్నారు. పెట్రోలింగ్‌తో జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్‌ల పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోడ్స్ వాహనాలతో రాత్రి, పగలు, గణేష్ మండపాలతో పాటు అన్ని ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలా నిర్వాహకులకు అవగాహన కల్పించామని తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు కనబడితే సమాచారం ఇవ్వాలని సూచించారు.

- గణేష్ నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశామని, గణేష్ నిమజ్జనానికి వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని గణేష్ శోభాయాత్ర వెళ్లేమార్గాలైన టవర్‌సర్కిల్, లడ్డూకాజా, తీన్‌ఖాని, చింతకుంటచెరువు ప్రాంతాలను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీరఘుచందర్, సీఐ టైన్‌సీఐ వేణుగోపాల్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ ఆలీఖాన్, ఎస్.ఐలు సుధీర్‌రావు, రాంచంద్రం, ఉన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

రాయికల్, సెప్టెంబరు 10: రాష్ట్రంలోని విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్ రావులు కోరారు. రాయికల్ మండలంలోని కిష్టంపేట, అల్లీపూర్ కస్తూర్బా విద్యాలయం, ఆలూరు, రాయికల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవో ఉపాధ్యాయులను వెంటనే తమ జిల్లాలకు పంపాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డీఎడ్ చేసిన సెకండరీ గ్రేడ్ వారితో కామన్ సీనియారిటీతో భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెరుకు మహేశ్వర శర్మ, ఎస్.గంగాధర్, కస్తూర్బా ఎస్‌వో శోభా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

కలెక్టర్ సత్య ప్రసాద్



చాకలి అయిలమ్మకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్,ఇతరులు

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి సందర్బంగా జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ భావితరాలకు ఆమె స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంతరావు, బీసీ సంక్షేమ అధికారి సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో అలసత్వం ప్రదర్శించరాదు

ప్రభుత్వ పథకాల అమలుకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో బ్యాంకర్లతో త్రైమాసిక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని జూన్ త్రైమాసిక వ్యవసాయ రుణాల రూ. 868 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వీధి వ్యాపారులకు సంబంధించి మూడవ విడతలో 1,290 మందికి రుణాలు మంజూరు చేశామని తెలిపారు. జిల్లాలో పలు ప్రైవేటు బ్యాంకులు కొన్ని పథకాలలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ అరుణ, సబిత, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, ఆర్‌బీఐ ఎల్‌డీవో రహమన్, జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, డీఆర్‌డీవో రఘువరన్ పాల్గొన్నారు.

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

వ్యాధులతో బాధపడే వారికి వైద్యం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పవని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సీజనల్ వ్యాధుల నివారణపై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలకు అవసరమైన టెస్టులు సరిగా నిర్వహించాలన్నారు. సీరియస్‌గా ఉన్న రోగులను సాధ్యమైనంత తొందరగా ఆసుపత్రుల్లో అడ్మిట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియోద్దిన్, డీఆర్‌డీవో రఘువరన్, జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

వెల్గటూర్, సెప్టెంబరు 10: వెల్గటూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త నందయ్య తండ్రి బుచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. స్తంభంపల్లిలో అవ్వ లింగమూర్తి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, జగన్, కుమార్ ఉన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 10 : మెట్‌పల్లి మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ ఆ ధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ నిర్వ హించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎలాంటి సమస్యలు చర్చ నిర్వహించకుండానే ముగించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వచ్చామా వెళ్లామా అన్నట్లుగా నామమాత్రంగా సాగింది. పూర్తి స్థాయిలో ప్రత్యేక అధికారులు రాకున్న తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకు న్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడు నెల లకొకసారి నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో ప్రజల సమస్యలను వివరించే వారు లేరు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకురాలేదు. ఉన్నత అధికారులు స్పందించి సమగ్రమైన చర్చ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సభ్యత్వంలో జిల్లాను రాష్ట్రంలో ముందుంచాలి

బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె గంగారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె గంగారెడ్డి-

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 10: గతంతో పోల్చితే జగిత్యాల జిల్లాలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతుందని విశ్వసిస్తున్నానని, ఇదే విశ్వాసంతో జిల్లా సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లా ముందుండాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె గంగారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రైవేట్ బంకెట్ హాల్‌లో బీజేపీ జిల్లా స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌నుంచి సుమారు 200లకు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలన్నారు. సభ్యత్వ నమోదుతో పాటు బూత్ స్థాయిలో కనీసం ఇద్దరికీ సోషల్‌మీడియా నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు ఆశించే సీనియర్ నాయకులు తమవంతుగా కనీసం వంద సభ్యత్వాలను వ్యక్తిగతంగా చేయించాల్సి ఉంటుందన్నారు. అలాంటి వారికే పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సభ్యత్వంలో అవకాశం కల్పించాలని, సెప్టెంబర్ 25వ తేదీలోపు సభ్యత్వం పూర్తి చేసి, రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం బహిరంగ ప్రదేశాల్లో సభ్యత్వ నిర్వహణ చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు, సభ్యత్వ నమోదు కన్వీనర్ డాక్టర్ రఘు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నాయకులు డాక్టర్ యాదగిరి బాబు, అంజయ్య, రాంబాబు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను త్వరగా చేయాలి

బల్దియా చైర్‌పర్సన్‌కు హిందూ క్షేత్రాల వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న హిందూక్షేత్రాల బాధ్యులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 10: విశ్వహిందూపరిషత్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తూ, త్వరితగతిన ఏర్పాటు చేయాలని హిందూ క్షేత్రాల బాధ్యులు బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో వినాయక నిమజ్జనం ఉంటుందని ఈ వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ బాధ్యులు ఏసీఎస్ రాజు, బోయిని పద్మాకర్, వేముల సంతోష్, సంతోష్, రాంచంద్రం, మామిడాల రాములు, ఆన్ కార్ సుధాకర్, కిషోర్‌సింగ్, మాడిశెట్టి మల్లేష్, కస్తూరి లక్ష్మణ్, విజయ్, శ్రీధర్ తదితరులున్నారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10: శాతవాహన విశ్వ విద్యాలయం (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) డిగ్రీ ఫస్ట్, సెకండ్, థర్డ్ ఇయర్ వైస్ ఎగ్జామ్ ఫీజు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. విశ్వ విద్యాలయ పరిధిలోని విద్యార్థులు చదువుకునే కళాశాలకు వెళ్లి ఫీజు చెల్లించాలన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫస్ట్, సెకండ్ అండ్ థర్డ్ ఇయర్ ఫీజు నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 10: దొంగతనం జరిగిన 24 గంటల్లోగా నిందితులను పట్టుకున్నారు రూరల్ పోలీసులు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి మంగళవారం సాయంత్రం వివరాలను వెల్లడించారు. మల్లారం గ్రామం రాజానగర్‌కు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ తన ఇంటికి కలర్ వేయడానికి వేములవాడకు చెందిన సందెల్లి అనీల్, సయ్యద్ అఫ్రోజ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కొన్నిరోజులుగా ఇంటికి కలర్ వేసే పని జరుగుతున్న క్రమంలో ఆదివారం శ్రీనివాస్ భార్యతో కలిసి బెజ్జంకికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని హ్యాండ్ బ్యాగ్ కనబడలేదు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో 25 గ్రాముల బంగారం ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపాడు. విచారణ చేపట్టిన రూరల్ ఎస్సై మారుతీ ఇంటికి కొద్ది దూరంలో బ్యాగును కనిపెట్టారు. బ్యాగుకు కలర్ మరకలు ఉండడంతో ఆ కోణంలో దర్యాప్తు చేశారు. కలర్ వేసిన అనీల్, అఫ్రోజ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం రికవరీ చేసి నిందితులను రిమాండుకు తరలించినట్లు ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి తెలిపారు. సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరూ.. అంత్యక్రియలకు..

మృతుడి ఇంట్లో దొంగతనం

మల్యాల, సెప్టెంబరు 10: మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబ సభ్యులు వెళ్లగా కాసేపటికే బంధువుగా చెప్పుకున్న వ్యక్తి ఒకరు మృతుడి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. కొండగట్టుకు చెందిన గౌరపల్లి లక్ష్మన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వైకుంఠధామానికి వెళ్లారు. అయితే ఇంటి వద్ద పనులు చేయడానికి కొందరు బంధువులు ఉన్నారు. అందులో కలిసి పోయిన ఓ వ్యక్తిపై అక్కడి వారందరికీ అనుమానం రాగ తాను కూడా బంధువునని చెప్పుకున్నాడు. అంత్యక్రియలు చేసి వచ్చే వరకూ తాను కూడా ఇక్కడే ఉంటానని పనులు చేసే అక్కడి వారికి సహకరించాడు. ఇంటి శుద్ధి పనులు అయ్యాక అతను ఇంట్లోకి వెళ్లగా కాసేపటికి కోతుల గుంపు ఇంట్లోకి వెళ్లింది. బయట ఉన్న వ్యక్తులు వాటిని తరమడానికి ప్రయత్నించడాన్ని గమనించిన సదరు వ్యక్తి ఇంట్లో నుంచి కోతులను తరుముతూ బయటకు వచ్చి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చి మిగతా బంధువులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి మూడు బీరువాలు పగులగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించారు. అక్కడ ఉన్న సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. కోతులు రాకపోతే ఇంట్లో బంగారు ఆభరణాలు ఇతరత్రా ఎత్తుకెళ్లేవాడని స్థానికులు తెలిపారు. నిందితుడు ద్విచక్రవాహనంపై పారిపోయాడన్నారు.



మానని గాయం

సెప్టెంబరు 11.. కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన రోజు. ఆ బస్సులో ఉన్న వారంతా కొండగట్టు అంజన్నను దర్శించుకుని వస్తున్న వారే. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా కలిసి అంజన్న వద్ద మొక్కులు తీర్చుకుని ఇళ్లకు బయల్దేరాలని బస్సు ఎక్కి కూర్చున్నారు. బస్సు మొత్తం నిండుగా ఉంది. ఎవరి ముచ్చట్లలో వారు నిమగ్నమయ్యారు. కొండగట్టు నుంచి బస్సు దిగుతుండగా ఒక్కసారిగా అదుపుతప్పి లోయలో పడింది. అంతే అందులో ఉన్న ప్రయాణికులకు ఏం జరిగిందో తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అప్పటి వరకు తమతో మాట్లాడిన కుటుంబ సభ్యులు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రమాదంలో 67 మంది వరకు చనిపోయారు. ఇంకొందరు తీవ్ర గాయాలపాలైన ఇప్పటికీ లేవలేని స్థితిలో ఉన్నారు. ప్రమాదం జరిగిన రోజును గుర్తు చేసుకుంటూ క్షతగాత్రులు ఇప్పటికీ కన్నీటి పర్యంతం అవుతున్నారు. అత్యంత విషాధకర ఘటన జరిగి ఆరేళ్లు అవుతోంది.

- కొండగట్టు బస్సు ప్రమాదంలో 67 మంది మృతి
- నేటికీ కలిచివేస్తున్న ఘటన
- బాధితులకు అందింది అరకొర సాయమే

మల్యాల, సెప్టెంబరు 10: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి నేటికి ఆరు సంవత్సరాలు. ఈ ప్రమాదంలోని ప్రయాణికుల హాహాకారాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు బంధువులతో పాటు స్థానికులను నేటికీ కలచి వేస్తున్నాయి. ఆనాటి ప్రమాద గుర్తులు కలవరపెడుతూనే ఉన్నాయి. ఈ సంఘటన దేశంలోనే అతిపెద్ద రహదారి ప్రమాదంగా నిలిచిపోగా.. సమారు 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ఈ ఘాట్‌రోడ్డుపై దిద్దుబాటు చర్యలు ఇప్పటి వరకు నామమాత్రమే.. ఘాట్‌రోడ్డు అలైన్‌మెంట్ సరిగా లేదని నిపుణులు పదేళ్లగా సూచిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో 2018 సెప్టెంబరు 11న కొండగట్టు గుట్టపై నుంచి ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి లోయలో బోల్తాపడి 67మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 45మంది వరకు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేశారు. వాహనాల రాకపోకలను నిషేదించారు. ఘాట్ రోడ్‌కు కొంతమేర మరమ్మతులు, కొన్ని చోట్ల రక్షణగోడల నిర్మాణం, స్పీడ్‌బ్రేకర్ల మరమ్మతులు మాత్రమే చేపట్టారు. శాశ్వతంగా ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. గతంలోనూ ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. అయినప్పటికీ, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు అంతంత మాత్రమే. రెండేళ్ల క్రితం నిబంధనలతో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎస్‌సీ ఆదేశాలను పాటించడం లేదు.


పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రమాదకారక బస్సు

● ఠాణా ముందే ఆర్టీసీ బస్సు..

ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 67మంది మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగ ఇప్పటికీ అలాగే ఉంది. ప్రమాదానికి సాక్షాత్కారంగా నిలుస్తోంది. ప్రమాదం అనంతరం న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. బస్సు రిలీజ్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో బస్సును తీసుకెళ్లడం లేదు. దీంతో బస్సు పూర్తిగా తుప్పు పట్టిపోతోంది. పైగా ఇది వ్యవసాయ భూములకు వెళ్లే మార్గంలో ఉండడంతో ఈ మార్గంలో నడిచే రైతులు, ఇతరులు బస్సును చూసి నాటి ప్రమాదాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు. బస్సును అక్కడి నుంచి తొలగించాలని పోలీసులను కోరుతున్నారు.

● బాధితులకు అందని సహాయం

ఘాట్‌రోడ్డు పక్కన గల లోయలో ఆర్టీసీ బస్సు పడి 67 మంది మృతి చెందగా మృతుల కుటుంబాలను కదిలిస్తే ఇప్పటికీ వారి కన్నీళ్లు వరదలుగా ప్రవహిస్తున్నాయి. మృతుల్లో 60మందికి పైగ కొడిమ్యాల మండలానికి చెందిన వారే ఉండగా వారికి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందకపోగా తీవ్ర వేదనకు గురౌతున్నారు. ప్రమాదం అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో పాటు ఆర్టీసీ రూ. 10లక్షలు అందించి చేతులు దులుపుకున్నట్లు బాధిత కుటుంబాలు అంటున్నాయి. క్షతగాత్రులు అయిన అనేక మంది ఇప్పటికీ మంచానికే పరిమితం కాగ కనీసం ప్రభుత్వం అందించే పింఛన్‌కు కూడా నోచుకోవడం లేదు. ప్రభుత్వం మృతుల కుటంబాలకు, క్షతగాత్రులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవల్సిన అవసరం ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆ దశగా చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాం


కొండగట్టు ఘాట్‌రోడ్డు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య


సాయిచరణ్ పోచయ్య (ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు, 10: వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన యువకుడు జీవితం విరక్తి చెంది మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం పెంబట్ల గ్రామానికి చెందిన తేలు చంద్రయ్య పెద్ద కుమారుడు తేలు సాయి చరణ్(21) డిగ్రీ చదువుతున్నాడు. సాయి చరణ్‌కు తన స్నేహితులతో పాటు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనే బలమైన కోరిక ఉండేది. అందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు వచ్చాయి. ఆ కోరిక నెరవేరలేదని మనస్తాపానికి గురై వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన తల్లితండ్రులు చికిత్స నిమిత్తం జగిత్యాలలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మళ్లీ కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చరణ్ తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివంగాలపల్లిలో వృద్ధుడు..

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామంలో సోమవారం వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన మక్కపల్లి పోచయ్య (80) అనే వృద్ధుడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించినప్పటికీ నయం కాకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మక్కపల్లి పరుశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..

కరీంనగర్ క్రైం: బొమ్మకల్ గ్రామ పరిధిలోని హుస్సేనిపురకు చెందిర ఎండీ అక్బర్ (50) మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కాగా అక్బర్‌కు దూరంగా పుట్టింటిలో ఉంటున్న అతడి మొదటి భార్య మున్నాబీ తన భర్త మరణంపై అనుమానాలున్నాయని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అక్బర్‌కు మున్నాబీతో వివాహం జరగగా వారికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. 6 నెలల కిందట భర్త కొట్టడంతో కూతుళ్లతో కలిసి పుట్టిళ్లు మేడిపల్లిలో ఉంటోంది. మొదటి భార్యకు తెలియకుండానే మరొక మహిళను వివాహం చేసుకుని కాపురం చేస్తున్నాడని, ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తనకు సమాచారం అందించారని తెలిపారు. ఇంటికి వెళ్లి చూడగా చనిపోయాడని మొదటి భార్య మున్నాబీ ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త ఆత్మహత్యపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 : పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను ఆరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.5,030 నగదు, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

మంథని, సెప్టెంబర్ 10: మున్సిపల్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇనుముల సత్యనారాయణ అనే వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మందల మల్లారెడ్డి అనే వ్యక్తిని ఇనుముల సత్యనారాయణ రూ.5లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. రెండు లక్షలు తీసుకొని మిగితా 3లక్షల కోసం గన్‌మెన్ అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో సైతం అనేక మందిని ఇలానే బెదిరింపులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిశాడని ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

రేషన్ షాపులో బెదిరింపులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10: గోదావరిఖని ఫైవింక్లయిన్‌లోని ఒక రేషన్‌షాపులో సోమవారం రాత్రి కొత్తపల్లి శివచరణ్ అనే వ్యక్తి చొరబడి తాను విలేకరినని, క్వింటాలున్నర బియ్యం కావాలంటూ బెదిరింపులకు పాల్పడినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. రాత్రి షాపులోకి వెళ్లి శివచరణ్ నిర్వాహకుడు శివరాత్రి సురేష్‌తో బియ్యం గురించి గొడవ పెట్టుకున్నాడన్నారు. తన వద్ద అంత బియ్యం లేవని సురేష్ పేర్కొనగా శివచరణ్ కోపంతో తాను పత్రికా విలేకరినని, బియ్యం ఇవ్వవా అంటూ మిషన్‌ను ధ్వంసం చేశాడని, అడ్డువెళ్లిన శివరాత్రి సురేష్‌పై దాడి చేశాడని, బియ్యం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉచిత విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

● పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 10: ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడికుమార్, ముల్కల తిరుపతి విమర్శించారు. మంగళవారం నగరంలో ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30న జార్జిరెడ్డి యాభై సంవత్సరాల సభను విజయవంతం చేయాలన్నారు. భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూ ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నదన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్, శ్రీపాదశ్రీహరి, కోల శంకర్, దుస్స చేరాలు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, మారోజు వీరన్న లాంటివీరులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు కెస్వప్న, లోకిని రమేష్, రాజశేఖర్, వర్షిని, శైలజ, రజనీకాంత్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో సీఐడీ విచారణ

● ఆసుపత్రిలో సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు తనిఖీ చేసిన అధికారులు

జమ్మికుంట, సెప్టెంబర్ 10: జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో జరిగిన సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లుల అక్రమాలపై తెలంగాణ సీఐడీ పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే ఘటనపై ఏడాది క్రితం అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. ఆగస్టు 26న సీఐడీ పోలీస్‌లు ఆసుపత్రికి వచ్చారనే సమాచారం అందుకున్న మీడియా అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుంది. కానీ సీఐడీ అధికారులు ఎవరు అటువైపు రాలేదు. మంగళవారం కూడా సీఐడీ అధికారులు విచారణకు వచ్చారనే విషయం తెలుసుకున్న మీడియా ఆసుపత్రికి చేరుకుంది. అప్పటికే సీఐడీ అధికారులు వెళ్లిపోయారు. సప్తగిరి ఆసుపత్రి నుంచి ఒకే ఐడిపై రెండు సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లులు సృష్టించారు. ఫేక్ బిల్లులను గుర్తించిన అధికారులు ఆసుపత్రిపై కేసు నమోదు చేశారు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సంతోష్ అనే వ్యక్తి బిళ్లలు తయారు చేశాడని వైద్యుడు వంశీకృష్ణ ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా సీఐడీ పోలీస్‌లు సదరు వ్యక్తితో పాటు వైద్యుడిని విచారించారు. ఫేక్ సిఎమ్ ఆర్‌ఎఫ్ బిళ్లలు ఎందుకు తయారు చేశారు... ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందని ప్రశ్నించారు. బిల్లులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆ ఫేక్ బిళ్లలు ఎలా వచ్చాయో తనకు తెలియదని, బిల్లులపై ఉన్న సంతకం కూడా తనది కాదని వైద్యుడు సమాధానం ఇవ్వగా, అసలు ఆ బిళ్లల సంగతే తనకు తెలియదని సంతోష్ తెలిపాడు. సీఐడీ పోలీస్‌లు మాత్రం బిళ్లలకు సంబంధించిన పలు రికార్డులు, పెన్‌డ్రైవ్‌లు తీసుకువెళ్లారు.

● సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లుల అక్రమాలపై అనుమానాలెన్నో?

సీఎమ్‌ఆర్‌ఎఫ్ బిల్లుల కోసం ఆసుపత్రి నుంచి చాలా పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ వైద్యుడికి సంబంధం లేకుండా బయటి వ్యక్తి తయారు చేయడం సాధ్యమేనా అన్న విషయంపై చర్చ జరుగుతోంది. సీఎం ఆర్‌ఎఫ్ కోసం ఆసుపత్రి నుంచి ఎమర్జెన్సీ సర్టిఫికెట్, ఎసెన్షియల్ సర్టిఫికెట్, డిశ్చార్జ్, ఇన్ పేషెంట్ ఐపి, ఇన్వెస్టిగేషన్, ఫార్మసీ, ల్యాబ్ తదితర బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటన్నింటినీ ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి తయారు చేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది.

చిరుత దాడిలో గొర్రె మృతి

చందుర్తి, సెప్టెంబర్ 10: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత పులి దాడిలో ఓ గొర్రె మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దోకె రాజయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెపై కొత్తకుంట సమీపంలో కర్షల బోరు వద్ద చిరుత పులి దాడి చేయడంతో గొర్రె మృతి చెందింది. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుత దాడికి ఓ మేక మృతి చెందినట్లు తెలిపారు. చిరుతపులి దాడితో పశువుల కాపర్లు, రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

● 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. డబ్బులు సులువుగా సంపాదించాలన్న ఆలోచనతో కొందరు ముఠాగా ఏర్పడి అంతరాష్ట్ర స్థాయిలో గంజాయి రవాణాకు పాల్పడడానికి నిర్ణయించుకున్నారు. ఆంధ్ర - ఒరిస్సా సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా గంజాయిని తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన ఎడమలపల్లి సాయి కుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, గౌరాపూర్ గ్రామానికి చెందిన ఎడవల్లి సాకేత్, జగిత్యాల మండలం దరూర్ గ్రామానికి చెందిన పాల రాజుకుమార్‌లను గంజాయి వ్యవహారంలో కొడిమ్యాల మండలం పూడూరు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆంధ్రా- ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి పెట్టుబడి పెట్టి తక్కువ ధరలో గంజాయిని కొనుగోలు చేసి పూడూరుకు తరలించారన్నారు. గంజాయిని ముఠా సభ్యులు పంచుకోవడా నికి ప్రయత్నిస్తున్న తరుణంలో పక్కా సమాచారం మేరకు కొడిమ్యాల, మల్యాల సర్కిల్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటనలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కొడిమ్యాల ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, కానిస్టేబుల్స్ తిరుమల్ రాజు, వినోద్, మల్యాల సీఐ నీలం రవి, డీఎస్పీ రఘు చందర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

బంగారు గొలుసు దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 10: ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 8న జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 1న లూర్దునగర్‌లో నివసిస్తున్న దొవతిరెడ్డి ప్రతాపరెడ్డి ఇంటి ముందు ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు హారన్ కొట్టారు. దీంతో ప్రతాప్ రెడ్డి బయటకు వచ్చి ఎందుకు హారన్ కొడుతున్నారని అడిగే ప్రయత్నంలో ఆటోలోని ముగ్గురు వ్యక్తులు ఆయన మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దోపిడీ విషయాన్ని ప్రతాపరెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఎన్‌టీపీసీ మెటీరియల్ గేట్ వద్ద ఆటోలో వెళ్తున్న ముగ్గురు నిందితులు గోదావరిఖనికి చెందిన ఆతుకూరి శ్రీనివాస్, బెజ్జంకి పృథ్వీరాజ్, రేణిగుంట రవితేజను అరెస్టు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి అపహరణకు గురైన రెండున్నర తులాల బంగారు గొలుసు, చోరీకి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 10: సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, ఘన్పూర్ గ్రామాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటింటికి తిరిగి రేషన్‌బియ్యం పోగుచేసి ఒకదగ్గర ఉంచి అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెన్కేపల్లి, ఘన్‌పూర్ గ్రామాలలో తన పోలీస్ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా రెండు గ్రామాలలో వేరువేరు చోట్ల అక్రమంగా నిలువ ఉంచిన 22క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని, వాటిని అక్రమంగా నిలువ ఉంచిన చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పెద్ద భత్తుల కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్

● ఆలయ విస్తరణకు ఏర్పాట్లు చేయాలని సూచించిన సీఎం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 10: శృంగేరి జగద్గురు ఇచ్చిన మహా ప్రసాదం, శృంగేరి పరంపర చిత్రపటాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులను ప్రారంభించడానికి శృంగేరి పీఠం వారి అనుమతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో వేముల శ్రీనివాసుల బృందం సోమవారం శృంగేరి పీఠంను సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జగద్గురు భారతి తీర్థ మహాస్వాముల వారు, పీఠాధిపతి విధిశేఖర భారతి స్వాముల వారు ఇచ్చిన మహాప్రసాదాన్ని అందేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆలయ విస్తరణ పనులపై సలహాలను, సందేహాలు నివృత్తి చేసిన తీరును వివరించారు. ఆలయ విస్తరణకు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సంబంధిత అధికారులకు సీఎం సూచించారు.


సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న మంత్రులు, ప్రభుత్వ విప్

ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి అనుకూలం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కరేనని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగార్డెన్‌లో ఎస్సీ వర్గీకరణపై సదస్సు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు మాత్రమే ఇచ్చిందని, ఇంకా వర్గీకరణ అమలు కావాల్సి ఉందన్నారు. ఎస్సీ వర్గీకణ విషయంలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. ఈ అంశంలో బీజేపీకి ఓటేయాలని మందకృష్ణ చెప్పినా అత్యధిక మాదిగలు కాంగ్రెస్‌కే ఓటు వేశారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇప్పటివరకు కేవలం మన సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే చెప్పారని, బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాల ముఖ్యమం త్రులు కాని, కేంద్రం కానీ ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

ఆస్తిలో వాటా కోసం భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

ఓదెల, సెప్టెంబరు 10: భర్త ఆస్తిలో వాటా కోసం మండలంలోని కొలనూర్‌లో మంగళవారం జంగ సంజీవరెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదుట అతడి భార్య వనజ, కూతురు శ్రీవర్ష బైఠాయించారు. బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ, సంజీవరెడ్డి మొదటి భార్య గతంలో మృతిచెందగా రెండో భార్యగా వీణవంక మండలం చల్లూర్‌కు చెందిన తనను వివాహం చేసుకున్నాడని తెలిపారు. కొద్ది రోజులైన తర్వాత ఆడపిల్లలు పుట్టారని చితకబాదుతూ చిత్రహింసలకు గురి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టారని, దీంతో తన తల్లి దగ్గర ఇద్దరు కూతుర్లతో బతుకుతున్నానని వనజ తెలిపారు. అనంతరం మరో మహిళను తీసుకువచ్చి కాపురం పెట్టాడని మూడో భార్యకు ఒక కుమారుడయ్యాడని తెలిపారు. మూడవ భార్య కుమారునికి 5 ఎకరాల భూమి పట్టా చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ఇక మిగిలిన 6 ఎకరాల్లో మూడు ఎకరాల భూమిని తన కూతుర్లకు పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఇది పరిష్కారం అయ్యేవరకు ఇక్కడి నుంచి వెళ్లనని, అధికారులు స్పందించి, నా ఇంటిలో స్థానం కల్పించాలని డిమాండ్ చేసింది. ఇంటి ముందు భార్య, కూతురు బైఠాయించడంతో ప్రస్తుతం ఇంటికి తాళం వేసి సంజీవరెడ్డి, ఇతని మూడో భార్య, ఇద్దరు వృద్ధులు ఇక్కడి నుంచి పరారీ అయ్యారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10: వ్యవసాయ మార్కెట్ ఎదురుగా రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రూ. 2.26 కోట్లకు కుచ్చుటోపీ.. పరారీలో వ్యాపారి

చిగురుమామిడి,సెప్టెంబరు 10: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ప్రవీణ్‌కుమార్ అనే వ్యాపారి ఇదే గ్రామానికి చెందిన రైతులు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు 98 మందికి 2.26 కోట్ల రూపాయల కుచ్చు టోపీ పెట్టిన వ్యాపారి పరారీలో ఉన్నాడు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాలుగా అడ్తి వ్యాపారం చేస్తూ అనేక మందికి నమ్మకంగా ఉండేవాడు. తిమ్మాపూర్ మండలం రేణికుంట, మొగిలిపాలెం, పర్లపల్లి, బెజ్జంకి మండలం దేవక్కపల్లి, ఇదే మండలం రేకొండ, గిద్దెపల్లి గ్రామాలకు చెందిన రైతులు వారి ధాన్యం వ్యాపారికి విక్రయించారు. తమ వద్ద ఉన్న డబ్బులను కూడా అతనికి వడ్డీకి ఇచ్చారు. నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని 2 కోట్ల 26 లక్షల రూపాయలను ఎగనామం పెట్టి వ్యాపారి పరారీ అయ్యాడు. వ్యాపారికి ధాన్యం, డబ్బులు ఇచ్చిన వారు ఆందోళనకు గురయ్యారు. వ్యాపారిపై జిల్లా పోలీస్ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందులో కొంత మంది తమ కూతుళ్ల వివాహాలకు, మరికొంత మంది పిల్లల చదువుల కోసం, అనేక మంది తమ డబ్బు భద్రంగా ఉంటుందని వ్యాపారి వద్ద పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 సంవత్సరాల క్రితం మూతపడిన అయిల్ మిల్లులో తాను చేసిన వ్యాపారంలో నష్టం వచ్చిందని సదరు వ్యాపారి ప్రవీణ్‌కుమార్ కోర్టును సంప్రదించి తమకు నోటీస్ పంపించారని బాధితులు అంటున్నారు. సంఘటనపై స్థానిక పోలీసులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రవీణ్‌కుమార్ ఇంటికి తాళం వేసి ఉన్నదని గ్రామస్థులు తెలిపారు. వ్యాపారి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ ఉందని అంటున్నారు. వ్యాపారికి ఇద్దరు కుమారులు, భార్య ఉంది.

చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తి ఆదర్శం



నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ తిరుపతి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 : చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తి యావత్ మహిళలోకానికి స్ఫూర్తిదాయకమని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చాకలిఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా దావ వసంతసురేష్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తికోసం కొట్లాడిన చాకలి ఐలమ్మ ధీరత్వం అందరికి ఆదర్శప్రాయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో చాకలిఐలమ్మ త్యాగాలకు గుర్తుగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీవైస్ చైర్మన్ అసిఫ్, రూరల్‌మండల బీఆర్ఎస్ నాయకులు కమలాకర్‌రావు, గంగారెడ్డి, తిరుపతి, రూరల్ మండలయూత్ అధ్యక్షుడు సదానందం, పూదరిశ్రీనివాస్, బాలెచందు, రజక సంఘం నాయకులు లింగన్న, బక్కన్న, భూమరాజం, రజకకులసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కోరుట్ల : రజాకర్లకు ఎదురు నిలబడి పోరాటం చేసిన ఘనత చాకలి ఐలమ్మకు దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రజక సంఘం, మున్సిపల్ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని పాత మున్సిపల్ ప్రాంతంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ పాలక వర్గ సభ్యులు, రజక సంఘ సభ్యులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. సీ. ప్రభా కర్ భవనంలో రాష్ట్ర నాయకుడు సుతారి రాములు ఆధ్వర్యంలో వర్ధంతి వేడు కలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎంబేరి నాగభూషణం, తిరుపతి, కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, మోర్తాడ్ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, గంగాధర్, రాజిరెడ్డి రజక సంఘ నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): పట్టణంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో అమె విగ్రహానికిపూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల అధ్యక్షులు వన్నెల శశి, కలిగోట వవేణు, పిప్పెర రాజ్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్,రాజయ్య, మురళి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, డబ్బ, గోధూర్, ఇబ్రహీం పట్నం గ్రామాలలో పాటు అయా గ్రామాల్లో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఆయా గ్రామాల రజక సంఘం నాయకులు, మాజీ ప్రజప్రతినిధులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అయా గ్రామాలలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను మంగళవారం రజక సంఘ సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలలో ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలు వేసి నివాళ్లను అర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మల్లాపూర్, మొగిలిపేట తదితర గ్రామాల్లో రజకులతో పాటు పలువురు నాయకులు మంగళవారం ఘన నివాళులర్పించారు. ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు నర్సయ్య, ఆశన్నలతో పాటు పలువురు పార్టీలకతీతంగా పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ తొలి భూ పోరాటయోధురాలు, వీర మాత చిట్యాల ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల మండల శాఖల అధ్యక్షులు నిశాంత్‌రెడ్డి, మహేష్, మాజీ వైస్ ఎంపీపీ సత్తయ్య, రజక సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు కలకోట సత్యం పాల్గొన్నారు.

మల్యాల: చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద గల ఐలమ్మ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రజక సంఘం నాయ కులు రాజమల్లయ్య, శైలేశ్, నర్సయ్య, రమేశ్, భూమేశ్వర్, వెంకటేష్, రవి, నర్సయ్య, మల్లయ్య, అంజయ్య పాల్గొన్నారు

కొడిమ్యాల : మండల కేంద్రంలోని అంగడి బజారులో అయిలమ్మ చిత్ర పటానికి, హిమ్మతురావుపేటలో విగ్రహానికి పూల మాలలు వేసి వర్దంతిని నిర్వహించారు. రజక సంఘం నాయకులు వొడ్నాల సాగర్, మల్లయ్య, సభ్యులు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, కొడిమ్యాల, తిర్మాలాపూర్ సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రాజేందర్, టీపీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న దావ వసంత



రాయికల్‌లో నివాళులర్పిస్తున్న రజక సంఘం సభ్యులు



మెట్‌పల్లిలో ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు దృష్టి సారించాలి

● కలెక్టర్ సత్యప్రసాద్ ● నామాపూర్‌లో పోషణ అభియాన్‌లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం

పెగడపల్లి, సెప్టెంబరు 10: చిన్నారులు, మహిళల ఆరోగ్య సంరక్షణపై అంగన్‌వాడీలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్‌లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ ఒకటో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డీడబ్ల్యువో నరేష్, ఆర్డీవో మధుసూదన్, డీపీవో రఘువరన్‌లతో కలసి కలెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేసి పోషణ అభియాన్‌లో ప్రదర్శించిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఉచితంగా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించడంతో పాటు, వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత, బరువు, ఎత్తు తదితర లోపాలకు చెక్ పెట్టడానికి పోషకాహారంపై అవగాహన కల్పించ డానికే పోషణ మాసోత్సవం నిర్వహిస్తామన్నారు.



పెగడపల్లి ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

విష జ్వరాలను అరికట్టేందుకు కృషి చేయాలి

జిల్లాలో విజృంభిస్తున్న విష జ్వరాలను అరికట్టేందుకు వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి రిజిష్టర్, ఇన్ పేషంట్ వార్డును పరిశీలించి ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది నిర్విరామంగా పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తూ వ్యాధుల నిరోదానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధుసూదన్, డీపీవో రఘువరన్, డిడబ్లువో నరేష్, జిల్లా వైద్యాధికారి సమీయొద్దిన్, మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, డీటీ రాజశేఖర్, డాక్టర్ నరేష్, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలీంగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ బి. సత్యప్రసాద్



మల్యాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మల్యాల, సెప్టెంబరు 10: రానున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పోలీంగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మల్యాలలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పరిశీలించారు. అంతకు ముందు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు తరగతి గదిలో కూర్చున్న కలెక్టర్ ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అవగాహన పరిశీలించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి రఘువరణ్, తహసీల్దార్ మునీంధర్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, విద్యాధికారి అయిత శ్రీనివాస్, పంచాయతీ ఈవో శ్రీకాంత్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన ప్రెస్‌క్లబ్ జేఏసీ

రాయికల్, సెప్టెంబరు 10: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను రాయికల్ ప్రెస్ క్లబ్ జేఏసీ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాయికల్ ప్రెస్‌క్లబ్ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అసాంఘీక కార్యకలాపాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన, రక్షణ చట్టాలు వంటి అంశాలపై విద్యార్థులకు, యువతీ, యువకులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయనున్న సదస్సుకు ఎస్పీని హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, ప్రెస్‌క్లబ్ జేఏసీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు సింగిడి శంకరయ్య, బొంగోని శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్

కథలాపూర్, సెప్టెంబరు 10: షెడ్యూల్డ్ కులాల జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ న్యాయమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంటే కేవలం మాల, మాదిగల పంచాయతీ కాదని 59 కులాల న్యాయబద్ధమైన పోరాటమన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలులో దేశంలోనే తెలంగాణలో ముందుంటుందని సీఎం ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఇప్పటికే ప్రకటించిన, రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్తింపజేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, సురుగు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్, ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్‌ఉన్నారు.

తిప్పన్నపేట లో ఉచిత ఆరోగ్య వైద్యశిబిరం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 :జగిత్యాల మండలంలోని తిప్పన్నపేటలో అధ్వానంగా పారిశుధ్యం ప్రబలుతున్నజ్వరాలు అనే శీర్షిక మంగళవారం 'ఆంధ్రజ్యోతి' జగిత్యాల జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు జగిత్యాల జిల్లా మాతశిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి పర్యవేక్షణలో వైద్యసిబ్బంది మంగళవారం గ్రామపంఆచయితీ ఆవరణలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఉచిత మందులు పంపిణి చేశారు. జగిత్యాల అర్బన్ ఎంపీవో సలీం ఆధ్వర్యంలో పంచాయతీకార్యదర్శి కొమురయ్య తన జీపి సిబ్బందితో గ్రామంలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేశారు. కారోబార్ శేర్ల రమేష్, ఏఎన్ఎం లావణ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి

రాయికల్, సెప్టెంబరు 10: భవిష్యత్తులో నిరుపేదలకు మరిన్ని సేవా కార్య క్రమాలు చేపట్టాలని రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులచే పట్టణంలోని బాలుర పాఠశాలలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 265 మందికి కంటి పరీక్షలు చేయగా 84 మందికి కంటి ఆపరేషన్ కోసం గుర్తించి, 44 మందిని ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వైద్యులతో సహా తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, వైద్యులు ఉదయ్ కుమార్, సబీర్ మహ్మద్, ప్రభాకర్, లయన్స్ క్లబ్ మాజీ డీసీలు మ్యాకల రమేష్, భూమయ్య, రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

పంచాయతీల ఏర్పాటుతో పల్లెల అభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

బీర్‌పూర్, సెప్టెంబరు 10: నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుతో పల్లెలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు మార్ అన్నారు. మండలంలోని మంగేళ గ్రామంలో గల గోండుగూడెంకు చెందిన ఆదివాసీలు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి గోండుగూడెంను ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటుకు కృషి చేసిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాం చందర్ రావ్, మాజీ సర్పం చ్‌లు చుంచు శారద నరేందర్, నల్ల మహిపాల్‌రెడ్డి, సుగుణ మారుతి, మాజీ ఎంపీటీ రమ రమేష్, గోండుగూడెంకు చెందిన భీమ్ రావ్, రామచంద్రం, పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదు చేయాలి

మెట్‌పల్లి,సెప్టెంబర్ 10(ఇబ్రహీంపట్నం): కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదును అధిక సంఖ్యలో చేయాలని బీజేపిరాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యలయంలో కోరుట్ల నియోజకవర్గ శక్తికేం ద్రాల సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో పాల్గొని అధిక సంఖ్యలో నమోదు చేయా లని అన్నారు. బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ డాక్టర్. రఘు, అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

విష జ్వరాల కట్టడిలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, సెప్టెంబరు 10: విష జ్వరాల కట్టడి లో రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం వెల్గటూర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విష జ్వరాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం ద్వారా విష జ్వరాలను కట్టడి చేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపుతో జీపీలకు నిధులు ఇచ్చి పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ చూపడంతో ఒక్క డెంగ్యూ కేసు కూడా నమోదు కాలేదన్నారు. ప్రభుత్వం తొమ్మిది నెలలుగా గ్రామ పంచాయితీలకు నిధులు ఇవ్వక పోవడంతో పల్లెల్లో పారిశుధ్యం లోపించడంతో దోమలు పెరిగి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు కరువయ్యాయన్నారు. అధికారం రాగానే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రజలను పట్టించుకోవడం మరిచారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విష జ్వరాల కట్టడికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, అధికారులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యంపై చర్యలు చేపట్టి విష జ్వరాల కట్టడికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్, ఎండపల్లి మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు రాంచంద్రం గౌడ్, జగన్, జూపాక కుమార్, గాజుల మల్లేశం, సుధాకర్‌రావు, మూగల సత్యం, నర్సయ్య, అశోక్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

'ఎయిడ్స్ ఉన్న వ్యక్తులపై వివక్ష చూపొద్దు'

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 10 : ఎయిడ్స్ ఉన్న వ్యక్తుల పట్ల వివక్ష చూపొద్దని ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రిలోని ఐసీటీసీ విభాగంలోని సిబ్బందిని సంప్రదిస్తే ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వారి వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవళి, పిల్లి రాణి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ప్రభుత్వ విప్

ధర్మపురి, సెప్టెంబరు 10: హైదరాబాద్‌లో నూతనంగా టీపీసీసీ అధ్యక్షులుగా నియామకమైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి మినిష్టర్ క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఖైరతాబాద్‌లోని బడా గణేషుడిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ ఖైరతాబాద్ మహా గణపతిని ప్రభుత్వ విప్ హోదాలో దర్శించుకోవటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రతి సంవత్సరం తప్పకుండా స్వామి వారిని దర్శనం చేసుకోవడం తనకు దొరుకు తుందని ఆయన అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ఆ దేవుడిని ఆశీస్సులు తమకు ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి

నేడు కథలాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కథలాపూర్, సెప్టెంబరు 10: ఈ నెల 11న మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటిస్తారని సెర్ప్ ఏపీఎం నరహరి, తహసీల్దార్ వినోద్ తెలిపారు. బొమ్మెనలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ ఎంటర్ ప్రైజెస్, కథలాపూర్‌లో పెరటి కోళ్ళ మదర్ యూనిట్ ప్రారంభిస్తారని తెలిపారు. అదేవిధంగా 24 మందికి కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు మండల పరి షత్ కార్యాలయంలో అందిస్తారని చెప్పారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

కథలాపూర్, సెప్టెంబరు 10: మండల తహసీల్దార్‌గా వినోద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ జిల్లా నుంచి పదోన్నతిపై ఇక్కడకు రాగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను తనతో నేరుగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెగడపల్లి నుంచి ఆయన బదిలీపై మెట్‌పల్లికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన శేఖర్ రెండు నెలల క్రితం నిజామాబాద్ జిల్లాకు బదిలీగాక ఇన్‌చార్జిగా ఇబ్రహీం పట్నం తహసీల్దార్ ప్రసాద్ విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పుల్ల జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు డాకురి వెంకటేష్, గడ్డం రాంరెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి తహసీల్దార్‌గా రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాస్ బదిలీపై మెట్‌పల్లికి వెళ్లగా , కాగజ్‌నగర్ నుంచి బదిలీపై వచ్చిన రవీందర్ పెగడ పల్లి తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. ఉద్యోగులు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొడిమ్యాల: కొడిమ్యాల తహసీల్దార్‌గా సారంగాపూర్ నుంచి బదిలీపై వచ్చిన రమేష్ బాధ్యతలను స్వీకరించారు. కొడిమ్యాలలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజమణి కోరుట్ల డీవిజనల్ అడ్మీనీస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్‌ను మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు వెలుగందుల అంజయ్య ఆధ్వర్యంలో డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ తహసీల్దార్‌గా ముంతాజుద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కథలపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ముంతాజుద్దీన్ ఇటీవల జరిగిన బదిలీలలో బీర్‌పూర్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

చెట్లను నరికిన వ్యక్తుల బైండోవర్

కొడిమ్యాల, సెప్టెంబరు 10 : మండలంలోని సూరంపేట అడవిలో అక్రమంగా చెట్లను నరికిన సూరంపేట, గంగరాంతండాకు చెందిన నలుగురు వ్యక్తులను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కొడిమ్యాల డీఎఫ్ఆర్వో ముషీర్‌అహ్మద్ తెలిపారు. డీఎఫ్ఆర్వో వెంట గోవిందారం, సెక్షన్ ఆఫీసర్ సుబ్బారావు, బీట్ అధికారులు అ శ్విని, ఫిరోజ్ ఉన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 10 : వర్షాకాలంలో ఇంటితో పాటు పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని వేంపేటలో డ్రై డే సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో రామ కృష్ణతో కలిసి కాలనీల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి అశోక్, ఏ ఎన్ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న మండల స్థాయి పోటీలు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 10: మండలంతో పాటు పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలు కొనసాతున్నాయి. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో పీఈటీలు అశోక్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, మహిపాల్, శంకర్, గీత, శంకర్, శ్రీలతలు విద్యార్థులకు మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నారు. ఖోఖో, కబ్బడీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. క్రీడలను మండల విద్యాధికారి నరేశం, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ల్ గంగాధర్, లక్ష్మీనారాయణలు పరవేక్షించి క్రీడాకారులకు సూచనలను చేశారు.

విద్యార్థులతో పాఠశాలలో పనులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10: మండల కేంద్రం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అటెండర్లు చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయించడంతో తల్లిదండ్రుల నించి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 11 నుంచి మండలంలో నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటిలను ఇబ్రహీంపట్నం జడ్పీ పాఠశాలలో నిర్వహించనున్నారు. క్రీడా ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులను ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులతో చేపిస్తున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు చేయించిన యువకుడు



జాతీయ రహదారికి మరమ్మతులు చేయిస్తున్న గణేష్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 10 : మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీ మధ్య ఉన్న 63వ జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో కోరుట్ల పట్టణానికి చెందని బిజ్జారపు గణేష్ మంగళ వారం తన స్వంత డబ్బులతో మరమ్మతులు చేయించాడు. జాతీయ రహదారిపై రోజూ వేల సంఖ్యల్లో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురిసి న వర్షాల కారణంగా రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో గణేష్ తన స్వంత డబ్బులతో మెట్‌పల్లి నుంచి కోరుట్ల వరకు ఉన్న గుంతలకు మరమ్మతులు చేయించి ఆదర్శంగా నిలిచాడు. గణేష్ చేసిన పనికి ప్రయాణికులతో పాటు సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.